డీసీసీ పదవి స్థానికులకే కేటాయించాలి : జక్కిడి



మహేష్‌కుమార్‌గౌడ్, కో ఇన్‌చార్జి విశ్వనాథన్‌తో భేటీ అయిన జక్కిడి ప్రభాకర్‌రెడ్డి

మన్సూరాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవిని స్థానిక నాయకులకు, ముఖ్యంగా కష్టసుఖాల్లో కాంగ్రెస్ పార్టీని అంటిపెట్టుకుని ఉన్న నాయకులకే కేటాయించాలని టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ సెక్రటరీ, తెలంగాణ రాష్ట్ర కో-ఇన్‌చార్జి పి.విశ్వనాథన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు.



మన్సూరాబాద్‌లో హెచ్‌ఐవీ ఎయిడ్స్ అవగాహన ర్యాలీని ప్రారంభించిన డీఎంహెచ్‌ఓ లలితాదేవి

సామాజిక అవగాహనతోనే హెచ్‌ఐవీ నిర్మూలన

మన్సూరాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): అందరిలో సామాజిక అవగాహన పెంపొందడంతోనే హెచ్‌ఐవీ ఎయిడ్స్ పూర్తిస్థాయిలో నిర్మూలించగలమని రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిణి డా.లలితాదేవి అన్నారు. మన్సూరాబాద్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గల టీబీ విభాగం ఆధ్వర్యంలో బుధవారం హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌ఓ లలితాదేవి విచ్చేసి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్‌ఐవీ ఎయిడ్స్ ప్రాణాంతక వ్యాధి అని, ఈ వ్యాధిని సరైన అవగాహనతో నిర్మూలించవచ్చన్నారు. ఇందుకోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ వివరించారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్ రెడ్డి

డివిజన్ అభివృద్ధికి మరింత కృషి చేస్తా: రాగుల

వనస్థలిపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించి మరింతగా అభివృద్ధి చేస్తానని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం వనస్థలిపురం డివిజన్ క్రిస్టియన్ కాలనీలో పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడు ముందుంటానని అన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు హరిందర్ రెడ్డి, కర్మాన్‌ఘాట్ ఆంజనేయ స్వామి ఆలయ డైరెక్టర్ కవిత, జీహెచ్‌ఎంసీ ఏఈ విఘ్నేశ్వరీ, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రమేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.



బైరామల్‌గూడలోని సువర్ణభారతి గోశాలలో అనుగ్రహ భాషణం చేస్తున్న విధుశేఖర భారతీస్వామి

ప్రతీ ఒక్కరు గో సంరక్షణ చేయాలి

శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతీస్వామి

చంపాపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని ప్రతీ ఒక్కరు గో సంరక్షణ చేయాలని, అవి కబేళాలకు తరలకుండా రక్షించాలని శృంగేరి పీఠాధిపతి జగద్గురువు శంకరాచార్య శ్రీశ్రీ విధుశేఖర భారతీస్వామి అన్నారు. హస్తినాపురం డివిజన్ బైరామల్‌గూడలోని తత్వం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మశ్రీ పశర్లపాటి శ్రీనివాస బంగారయ్యశర్మ నేతృత్వంలో కొనసాగుతున్న సువర్ణభారతి గోశాలలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమానికి బుధవారం భారతీస్వామి విచ్చేశారు. స్వామి గోశాలను సందర్శించి గోపూజను నిర్వహించారు. అనంతరం స్వామి అనుగ్రహ భాషణం ఇస్తూ గో హత్య మహాపాపం అన్నారు. గోవులను సంరక్షించుకోవాలని, నిత్యం పూజించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త తెలుకుంట్ల రమేష్‌గుప్తా, శ్రీ ప్లాంజరీ, హైకోర్టు న్యాయమూర్తులు ప్రవీణ్‌కుమార్, రామకృష్ణారెడ్డి, మొహియుద్దీన్, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు గీతామూర్తి, ప్రవచనకర్తలు గంగాధరశాస్త్రి, డా.అనంతలక్ష్మి, నండూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డితో కలిసి ప్రచారం చేస్తున్న కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్

బీజేపీ అభ్యర్థి గెలుపుకోసం ప్రచారం

కొత్తపేట,అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డిని గెలిపించాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్ కుమార్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఓటర్ల మద్దతు కోరుతూ అభ్యర్థి దీపక్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుతో కలిసి ఆయన జూబ్లీహిల్స్ డివిజన్లలో ప్రచారం చేశారు. వెంగళరావునగర్ డివిజన్‌లో ఓటర్లను కలిసి బీజేపీ అభ్యర్థి విజయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వగ్గుల సుందర్ నారాయణ, కొత్తపేట డివిజన్ ప్రధాన కార్యదర్శి గట్టు మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మెడిసిన్‌లో సీటు సంపాదించిన హయత్‌నగర్‌కు చెందిన దళిత సంఘాల నేత ఎర్ర రవీందర్ కుమారుడు సాయి తేజను అభినందిస్తున్న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ.

- హయత్‌నగర్, ఆంధ్రజ్యోతి

భళా.. సదర్ మేళా

దున్నపోతుల విన్యాసాలు.. కర్రసాములు

ఊరేగింపులో యాదవ సోదరుల నృత్యాలు

ఘనంగా సైదాబాద్ సదర్ ఉత్సవాలు

సైదాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఉప్పరిగూడ, చావుని యాదవ సంఘం ఆధ్వర్యంలో సైదాబాద్ ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి యాదవులు సదర్‌మేళాను ఘనంగా నిర్వహించారు. బ్యాండ్ మేళా, డప్పు వాయిద్యాలు, కర్రసాములు, దున్నపోతులతో నృత్యాలు చేస్తూ యాదవ సోదరులు భారీ ఊరేగింపు నిర్వహించారు. నిజాం కాలం నాటి నుంచి ఆనవాయితీగా నిర్వహిస్తున్న ఈ మేళాలో యాదవులు తమ గేదెలను, దున్నపోతులను రంగు రంగుల పూలు, వస్త్రాలతో అలంకరించి మేళ తాళాలతో, నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ మేళాను తిలకించడానికి పాతనగర ప్రజలే కాకుండా శివారు ప్రాంతాలలోని ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దీపావళి మరుసటి రోజు నుంచి మూడు రోజుల పాటు సదర్‌మేళా నిర్వహించే ఆనవాయితీ గత కొంతకాలంగా వస్తుంది. సదర్‌లో పాల్గొన్న దున్నపోతుల యజమానులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ మేళాలో మాజీగవర్నర్ బండారు దత్తాత్రేయ, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్ నేతలు సహదేవ్ యాదవ్, వీరేందర్ బాబు ఉప్పరిగూడ, చావుని యాదవ సంఘం ప్రతినిధులు సంపత్ యాదవ్, రాంపాల్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సదర్ మేళాలో దున్నపోతుల విన్యాస్యాలు



సదర్‌మేళాలో మాజీగవర్నర్ బండారు దత్తాత్రేయ యాదవ సంఘం ప్రతినిధులు

హయత్‌నగర్‌లో..

హయత్‌నగర్ : హయత్‌నగర్ యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్, గజ్జిభాస్కర్‌యాదవ్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు చెన్నగోని రవీందర్‌గౌడ్, నక్క ఉమేష్‌యాదవ్, హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్‌రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, పలువురు పాల్గొన్నారు



హయత్‌నగర్‌లో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్, గజ్జిభాస్కర్‌యాదవ్

సందడిగా నాగోల్ యాదవ సదర్ సంబరం

మన్సూరాబాద్: నాగోల్ యాదవ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నాగోల్ 'యాదవ సదర్ సమ్మేళనం' ఉత్సవాలు సందడిగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, స్థానిక కార్పొరేటర్ చింతల అరుణా సురేంద్రనాథ్‌యాదవ్, కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయ మాజీ చైర్మన్ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, నాగోల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్‌జానీ విచ్చేశారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్‌యాదవ్ ఆధ్వర్యంలో వారికి జ్ఞాపికలతో సత్కరించారు.



పోలీస్ అధికారులను సన్మానిస్తున్న యాదవ సంఘం ప్రతినిధులు



హయత్‌నగర్ కార్పొరేటర్ నవ జీవన్‌రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ నరసింహారెడ్డికి మెమెంటో బహూకరిస్తున్న యాదవ సంఘం



నాగోల్‌లో కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్‌యాదవ్, టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

సురక్షిత ప్రయాణమే లక్ష్యం : టీటీఐ ఇన్‌స్పెక్టర్ రాచపుడి

కొత్తపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): వాహనదారుల ప్రమాద రహిత సురక్షిత ప్రయాణమే లక్ష్యమని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే వాహనదారులందరూ ఇబ్బందులు లేకుండా గమ్యం చేరుకుంటారని ఆర్ఎస్ఐ సంతోష్ కుమార్, ఎస్ఐ నర్సింహారావు ఏఎస్ఐ సోమ్‌నాథ్ 482 మంది వివిధ సంస్థల సిబ్బందికి, వాహనదారులకు సూచించారు. బుధవారం వారు కూడళ్లలో వాహనదారులకు రామంతపూర్, నాచారంలో పలు సంస్థల్లో, మల్లాపూర్‌లో హెచ్‌పీ, బీపీసీ) చెంగిచర్ల ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వద్ద ట్రాఫిక్ నిబంధనలపై 17 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపితే ప్రమాదాలు చోటు చేసుకుంటాయని తెలిపారు. 482 మంది సంస్థల సిబ్బంది, వాహనాదారులకు నిబంధనలు పరిచయం చేసే కరపత్రాలు పంపిణీ చేశారు.

49 మంది మద్యంప్రియులకు కౌన్సెలింగ్

మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడకండి అంటూ టీటీఐ ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపుడి, ఎస్ఐ ఎస్‌పీఓ అల్లూరయ్య వివరించారు. రాచకొండ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ వాహనాల తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 49 మంది మద్యం ప్రియులకు వారి కుటుంబ సభ్యుల సమక్షంలో బుధవారం రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కు లెక్చర్‌హాల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే కలిగే అనర్థాలపై అవగాహన అవసరమన్నారు. సిబ్బంది రమేష్ సందేశాత్మక గీతాలు, మద్యం మత్తులో వాహనాలు నడపడంతో జరిగిన పలు ప్రమాదాల వీడియో క్లిప్పులను, ప్రముఖుల సందేశాలనూ ప్రదర్శించారు.



బీపీసీ సిబ్బందికి కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీటీఐ ఏఎస్ఐ సోమ్‌నాథ్



ఎంపీవో మధుసూదనచారికి వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ జిల్లా నాయకుడు నరసింహ, కార్మికులు

గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలను చెల్లించాలి : సీఐటీయూ

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గత కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ సిబ్బంది వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా నాయకుడు ఏర్పుల నరసింహ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ ఎంపీవో మధుసూదనచారికి పంచాయతీ సిబ్బందితో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం నరసింహ మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా పంచాయతీ సిబ్బందికి జీతాలు చెల్లించడం లేదని దాంతో వారికి కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రీన్ చానల్ ద్వారా జీతాలు చెల్లిస్తామని చెప్పి నెలలు గడుస్తున్న పట్టించుకోవడం లేదన్నారు. అదే విధంగా ప్రతి ఏడాది కార్మికులు ఇవ్వాల్సిన బట్టలు, చెప్పులు, సబ్బులు, నూనెలు ఇవ్వడం లేదన్నారు. పంచాయతీ పాలకవర్గం లేకపోవడంతో ఇబ్బంది సమస్యలను ఎవ్వరు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లోగా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంజయ్య, జ్యోతి, మనీలా, రాజు, లక్ష్మయ్య, లలిత, యాదమ్మ, కవిత, మంజుల, లక్ష్మమ్మ, రాజు, బాటన్ చంద్రయ్య, లింగయ్య పాల్గొన్నారు.

ఇద్దరు జీహెచ్‌ఎంసీ కార్మికుల హఠాన్మరణం



మృతురాలు కలమ్మ పార్థీవదేహానికి నివాళులర్పిస్తున్న మద్దిలేటి తదితరులు

మన్సూరాబాద్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ పారిశుధ్య విభాగంలో విధులు చేపట్టే ఇద్దరు కార్మికులు బుధవారం ఆకస్మికంగా మృతిచెందారు. నాగోల్ డివిజన్ మత్తుగూడకు చెందిన కాటేపాక కలమ్మ(55) జీహెచ్‌ఎంసీలో పారిశుధ్య విభాగంలో విధులు నిర్వహిస్తుంది. కాగా సోమవారం బండ్లగూడ ఆనంద్‌నగర్‌లో కలమ్మ కింద పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రైవేటు ఆస్పత్రితో చికిత్స పొందుతూ కలమ్మ మృతిచెందింది. కలమ్మకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఛాతి నొప్పితో మరో కార్మికుడు

జీహెచ్‌ఎంసీ ట్రాన్స్‌పోర్టు విభాగం (చెత్తసేకరణ)లో పనిచేస్తున్న చంపాపేటకు చెందిన ఎడ రాజు(42) విధి నిర్వహణ నిమిత్తం బుధవారం ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయానికి చేరుకున్నాడు. డ్యూటీకి వెళ్లిన 10నిమిషాల్లో అతడి ఛాతిలో నొప్పి రావడంతో వేరే డ్రైవర్‌కు వాహనాన్ని ఇచ్చి చంపాపేటలోని తన నివాసానికి వెళ్లాడు. ఇంటికి వెళ్లిన కొద్ది సమయానికే రాజు మృతిచెందాడు. కాగా ఇతడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఆదుకోవాలి: మద్దిలేటి

విధి నిర్వహణలో హఠాన్మరణం చెందిన కార్మికులు కాటేపాక కలమ్మ, ఎడ రాజులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ మున్సిపల్ జోన్ ప్రధానకార్యదర్శి మద్దిలేటి కోరారు. మృతిచెందిన కార్మికుల మృతదేహాలను సందర్శించిన ఆయన వారికి నివాళులర్పించారు. మృతులకు ఒక్కొక్కరికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు.

కార్తీక మాసోత్సవాలు ప్రారంభం

కొత్తపేట,అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ పరిధిలోని ఆలయాల్లో బుధవారం పవిత్ర కార్తీక మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్నేహపురి పద్మావతీ గోదాసమేత వేంకటేశ్వరాలయం, విజయవినాయక ప్రసన్నాంజనేయ, విశాలాక్షీ, అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర, అయ్యప్ప స్వామి ఉపాలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష పూజలు, స్వామివార్లకు రుద్రాభిషేకాలు అర్చనలు, సత్యనారాయణ స్వామి వ్రతాలు, సహస్రనామ పారాయణాలు, దీపోత్సవాలు నిర్వహించనున్నారు. సాయంత్రం ఆలయంలో ఆకాశదీపం వెలిగించారు. వచ్చే నెల 20వ తేదీ వరకు కార్తీక మాసోత్సవాలు కొనసాగుతాయని స్నేహపురి పద్మావతీ గోదాసమేత వేంకటేశ్వరాలయం ధర్మకర్తల మండలి వారు తెలిపారు.

డిప్లొమా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ : ఎమ్మెల్యే రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): డిప్లొమా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉన్నదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యాలయం దేవాలయంతో సమానమని.. విద్యార్థుల భవిష్యత్ కోసం ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే 10 ఎకరాల్లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని పలు కంపెనీలతో మాట్లాడి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానన్నారు. విద్యారంగానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో 1.50 లక్షల ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. రాబోవు రోజు ల్లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అనేక కంపెనీలు రాబోతున్నాయని తెలిపారు. అంతకు ముందు కళాశాలలో తాగునీటి కుళాయిని ప్రారంభించి మొక్కలు నాటారు. అనంతరం విద్యార్థులకు పట్టా సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగముని నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

స్నేహపూర్వక పోలీసింగ్ అవసరం

ఎల్బీనగర్ డీసీపీ అనురాధ

హయత్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాచకొండ కమిషనర్ ఆదేశం మేరకు బుధవారం ఎల్బీనగర్ జోన్ డీసీపీ అనురాధ హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసులు చట్టం అమలులో భయం, పక్షపాతం లేకుండా వ్యవహరించాలని కోరారు. శాంతి భద్రతలను కాపాడడానికి క్రమశిక్షణ, నిబద్ధత, నిజాయితీతో పని చేయాలన్నారు. అదే విధంగా ప్రాథమిక పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని కోరారు. ప్రజలకు దగ్గరగా ఉంటూ ఎప్పటికప్పుడు నిఘా సమాచారాన్ని రాబట్టుకోవాలని కోరారు. బీట్ పహారా, నిఘా ఇంటలిజన్స్, నేర నివారణ, శాంతి భద్రతల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. స్నేహపూర్వక పోలీసింగ్ ద్వారా ప్రజలకు విశ్వాసం కలుగుతుందని తెలిపారు. అదే విధంగా ఆధునిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. కమిషనర్ ఆదేశాలను పోలీసులందరూ విధిగా పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, హయత్‌నగర్ సీఐ నాగరాజుగౌడ్, డీఐ సంతోష్‌కుమార్‌తో పాటు పలువురు పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.



హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎల్బీనగర్ జోన్ డీసీపీ అనురాధ



అంజదుల్లాఖాన్‌ను హౌజ్ అరెస్టు చేసిన డబీర్‌పుర పోలీసులు

అంజదుల్లాఖాన్ హౌజ్ అరెస్ట్

చాదర్‌ఘాట్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి):ఎంబీటీ అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్‌ను బుధవారం డబీర్‌పుర పోలీసులు చంచల్‌గూడలోని ఆయన నివాసంలో హౌజ్ అరెస్టు చేశారు. ఇటీవల నిజామాబాద్‌లో కానిస్టేబుల్ ప్రమోద్ హత్య కేసులో నిందితుడైన రియాజ్ ఎన్‌కౌంటర్‌లో హతమైన ఘటనను నిరసిస్తూ ఆయన కుటుంబీకులను కలవడానికి వెళ్తున్నట్లుగా సమాచారం అందడంతో ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా డబీర్‌పుర పోలీసులు హౌజ్ అరెస్టు చేశారు. బుధవారం ఉదయం నుంచి అంజదుల్లాఖాన్ తన నివాసం నుంచి బయటికి రాకుండా ఆయన ఇంట్లోనే నిర్బంధించారు.

నేడు జర్నలిస్టుల మెగా వైద్యశిబిరం

దిల్‌సుఖ్‌నగర్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో లిఖిత డయాగ్నస్టిక్ సెంటర్ సౌజన్యంతో గురువారం జర్నలిస్టుల మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు టీయూడబ్ల్యుజే-ఐజేయూ రంగారెడ్డి జిల్లా ప్రధానకార్యదర్శి మేకల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు నరసింహ మొగిలి, హెల్త్ క్యాంప్ కన్వీనర్ ఆర్.శేఖర్ వెల్లడించారు. చైతన్యపురి డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్‌లో గల లిఖిత డయాగ్నస్టిక్ సెంటర్ ఆవరణలో గురువారం ఉదయం 10 గంటల నుంచి ఎల్బీనగర్ నియోజకవర్గంలోని వర్కింగ్ జర్నలిస్టులకు ఉచితంగా మాస్టర్ హెల్త్ చెకప్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. లిఖిత డయాగ్నస్టిక్ యజమానులు డా.ఎ.వి.నాయుడు, డా.శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైద్యబృందం వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పుట్టపర్తికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

చాదర్‌ఘాట్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భగవాన్ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆర్టీసీ హైదరాబాద్-1 డిపో నవంబరులో ప్రతీ శనివారం సాయంత్రం పుట్టపర్తికి ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించినట్లు డిపో మేనేజర్ ఎం.వేణుగోపాల్ తెలిపారు. నవంబరు 1వ తేదీ, 8, 15, 22వ తేదీల్లో సాయంత్రం 6గంటలకు ఎంజీబీఎస్ నుంచి బయల్దేరి మరుసటి రోజు ఆదివారం తెల్లవారుజామున 4గంటలకు పుట్టపర్తికి చేరుకుంటుందన్నారు. తిరిగి పుట్టపర్తి నుంచి అదే రోజు సాయంత్రం 6గంటలకు బయల్దేరి మరుసటి రోజు సోమవారం తెల్లవారు జామున 4గంటలకు ఎంజీబీఎస్‌కు చేరుకుంటుందని ఆయన వివరించారు. 36 సీట్లతో కూడిన సూపర్ లగ్జరీ బస్సుల్లో ఒక్కరికి రూ.2100 చార్జీ వసూలు చేయనున్నారు. టికెట్ బుకింగ్ కోసం దగ్గర్లోని బుకింగ్ ఏజెంట్లనుగాని, టీజీఎస్ ఆర్టీసీ ఆన్‌లైన్ ద్వారా గాని సీట్లను రిజర్వు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాల కోసం 9440566379, 7382824794 ద్వారా సంప్రదించవచ్చన్నారు.